బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 11 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

3 నెలల్లో బీసీ కుల గణన చేయాలి

- తెలంగాణ హైకోర్టు

బలగం టీవి, హైదరాబాద్

బీసీ కులగణన 3 నెలల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కులగణన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించింది. బీసీ కులగణన చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను ఎర్ర సత్యనారాయణ అనే వ్యక్తి 2019లో ఫైల్ చేశారు.కాగా ఈ పిటిషన్‌పై సిజె ధర్మాసనం మంగళవారం మరోసారి విచారించింది. బీసీ కులగణనపై సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నా యని పిటిషనర్ హైకోర్టు దృష్టికి తీసుకు రాగా అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అడ్వకేట్ జనరల్ తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం మూడు నెలల్లో కులగణన చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణ ముగించింది. బీసీ కులగణన ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల పట్ల తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్ హర్షం వ్యక్తం చేశారు. కుల గణనను బీసీ కమిషన్ సమర్థంగా నిర్వహిస్తుం దని వెల్లడించారు. కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాంపల్లిలోని యూసఫియన్ బాబా దర్గాలో నిరంజన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఆర్థికంగా తెలంగాణకు అనేక సవాళ్లు

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు నిధుల వాటా 50%కు పెంచండి

- కేంద్రపథకాల రూపకల్పనకు స్వయంప్రతిపత్తి అందించాలి
- రూ.6.85 లక్షల కోట్ల రుణభారంతో తెలంగాణ సతమతమవుతోంది
- దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యానికి మేం సంపూర్ణంగా సహకరిస్తాం
- 16వ ఆర్థిక సంఘం సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ మరింత పురోభివృద్ధి సాధించేలా రాష్ట్రానికి తగినంత సహాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 16 వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు సవాలుగా మారిన రుణ భారాన్ని తగ్గించేందుకు తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని, రుణాలను రీ స్ట్రక్చర్ చేసే అవకాశం కల్పించాలని లేదా అదనపు ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు.దేశంలోనే తెలంగాణ వేగంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని, దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ ఆర్థికంగా తెలంగాణ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన 16వ ఆర్థక సంఘం సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.

16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పణగరియా అధ్యక్షతన, సభ్యులుఅజయ్ నారాయణ్ ఝా, అనీ మాథ్యూస్, డాక్టర్ మనోజ్ పండా, డాక్టర్ సౌమ్యా కాంతి ఘోష్ సమక్షంలో జ్యోతీబా పూలే ప్రజాభవన్‌లో జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రస్తుత పరిస్థితులను వివరించి రాష్ట్ర అభిమతాన్ని ముఖ్యమంత్రి వారి ముందుంచారు.

"కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41% నుంచి 50% కి పెంచండి. అన్ని రాష్ట్రాల తరపున ఈ డిమాండ్ మీ ముందుకు వస్తోంది. ఈ విషయంలో సానుకూలంగా స్పందించండి.దేశంలోనే తెలంగాణ యంగెస్ట్ స్టేట్. మా రాష్ట్రాన్ని ది ఫ్యూచర్ స్టేట్‌గా పిలుస్తున్నాం. దేశంలోనే వేగంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం మాది. మన దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుంది.

బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ, రాష్ట్రం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రుణ భారం రూ.6.85 లక్షల కోట్లకు చేరుకుంది. ఇందులో బడ్జెట్ రుణాలతో పాటు ఆఫ్-బడ్జెట్ రుణాలూ ఉన్నాయి.గత పదేళ్లలో మౌలిక ప్రాజెక్టులకు నిధుల సమీకరణకు ప్రభుత్వం భారీగా అప్పులు తీసుకుంది. రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ భాగం రుణాన్ని తిరిగి చెల్లించడానికే వెచ్చించాల్సిన పరిస్థితి. రుణాలు, వడ్డీ చెల్లింపులు సక్రమంగా నిర్వహించకపోతే ఆ ప్రభావం రాష్ట్ర పురోగతిపై చూపే ప్రమాదం ఉంది.దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యానికి మేం సంపూర్ణంగా సహకరిస్తాం. తెలంగాణను ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది మా లక్ష్యం.

భారత్‌ను ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో తెలంగాణ తరపున మా వంతు బాధ్యతను నేరవేరుస్తాం. ఫిస్కల్ ఫెడరలిజం బలోపేతం చేయడంలో మీ మద్దతు కోరుతున్నాం. తెలంగాణ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి 16వ ఆర్థిక సంఘం సిఫారసులు ఉపయోగపడతాయని మేం విశ్వసిస్తున్నాం." అని అన్నారు.

రాష్ట్రానికి మరో 4 మెడికల్ కాలేజీలు

- యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీలకు కేంద్ర ఆరోగ్యశాఖ గ్రీన్ సిగ్నల్

బలగం టీవి, హైదరాబాద్

లంగాణలో మరో నాలుగు మెడికల్ కాలేజీలకు కేంద్ర ఆరోగ్య శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీలకు అనుమతి ఇవ్వాలని జాతీయ వైద్య కమిషన్‌ను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది.ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున, మొత్తం 200 సీట్లు ఈ కాలేజీల్లో అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే ములుగు, నర్సంపేట్, గద్వాల్, నారాయణపేట్ మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. మొత్తం ఎనిమిది కాలేజీల్లో కలిపి 400 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దాంతో ప్రభుత్వ కాలేజీల్లో మొత్తం సీట్ల సంఖ్య 4090కి చేరింది.

ఈ ఏడాది ప్రభుత్వం ఎనిమిది కాలేజీలకు దరఖాస్తు చేసింది. జూన్‌లో ఈ కాలేజీల పరిశీలనకు వచ్చిన ఎన్ఎంసీ అధికారులు, ఇక్కడ కాలేజీల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. టీచింగ్ స్టాఫ్, సౌకర్యాలు లేకుండా అనుమతులు ఇవ్వలేమన్నారు. అధికారులు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకురావడంతో, అవసరమైన నిధులను కొత్త సర్కార్ కేటాయించింది. ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను సవరించి ఫస్ట్ అప్పీల్‌కు వెళ్లింది. ఈ అప్పీల్ తర్వాత ములుగు, నర్సంపేట, గద్వాల, నారాయణపేట కాలేజీలకు పర్మిషన్ ఇచ్చిన ఎన్ఎంసీ, మిగిలిన నాలుగు కాలేజీలకు అనుమతి ఇవ్వలేదు. ఈ కాలేజీల అనుమతులపై ఆరోగ్యశాఖ మానిటర్ చేసి, యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ కాలేజీలకు స్టాఫ్‌ను నియమించారు. ఇటీవల జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్స్‌లో మొదట ఆ నాలుగు కాలేజీల్లోని ఖాళీలను భర్తీ చేసి.. మిగతా కాలేజీల్లో స్టాఫ్‌ను బదిలీ చేశారు.

16న ఢిల్లీకి సీఎం రేవంత్ !

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ నెల 16న ఆయన పర్యటన ఖరారైంది. ఈ పర్యటనలో రేవంత్ తో పాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు కూడా వెళ్లే అవకాశం ఉంది. ఈ పర్యటనలో మంత్రివర్గ విస్తరణపై ప్రధానంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. అలాగే నామినేటెడ్ పోస్టుల భర్తీ, పీసీసీ కార్యవర్గ కూర్పు తదితర అంశాలపై పార్టీ అధిష్ఠానంతో చర్చించే అవకాశం ఉంది.

టీవీవీపీ ఆసుపత్రుల్లో సిబ్బందికి వేతనాలివ్వాలి

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఆరు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడం అమానుషమని అన్నారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చెప్పుకునే ముఖ్యమంత్రికి వీరి వెతలు కనిపించకపోవడం శోచనీయమని విమర్శించారు. జీతాలు చెల్లించాలని కోరుతూ సిబ్బంది ఎన్నిసార్లు నిరసనలు తెలియజేసినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా ఉండటం లేదని అన్నారు. వారి గోడును పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విషజ్వరాలు విజృంభించి రోగులతో ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్న సమయంలో, ఆసుపత్రుల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేయకుండా చోద్యం చూస్తున్నదని అన్నారు.. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం ఆసుపత్రి సిబ్బందికి శాపంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, టీవీవీపీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

భవిష్యత్ ప్రణాళికలు ఫైనాన్స్ కమిషన్‌ను ఆకర్షించాయి : చైర్మెన్ అర్వింద్ పనగారియా

తెలంగాణ లో ఉన్న భవిష్యత్ ప్రణాళిక లు ఫైనన్స్ కమిషన్ ను ఆకర్షించిందని 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ అర్వింద్ పనగారియా తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన 16వ ఆర్థక సంఘం సమావేశంలో అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చాలా పారదర్శకంగా చర్చలు జరిగాయని, రాష్ట్రం లోనీ ఆర్థిక పరిస్థితిని రాష్ట్రం వివరించిందన్నారు. తెలంగాణలో ఉన్న భవిష్యత్ ప్రణాళిక లు ఫైనన్స్ కమిషన్ ను ఆకర్షించిందని, అర్బన్ డెవలప్మెంట్ పై తెలంగాణ ఫోకస్ చేయడం అభినందనీయమన్నారు. దీంతో పాటుగా గ్రామీణాభివృద్ధి పై కూడా పోకస్ చేశారని, రాష్ట్రం లో ఆర్థిక వృద్ధి , అప్పులపై ప్రజెంటేషన్ ఇచ్చారన్నారు అర్వింద్ పనగారియా. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలు అభిప్రాయాలను, వినతులను తీసుకున్నామని ఆయన తెలిపారు.లోకల్ బాడి అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి వినతులను తీసుకున్నామని ఆయన వెల్లడించారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధుల పై ప్రభుత్వం నుంచి వినతి ఇచ్చారని, దేశ వ్యాప్తంగా పర్యటన కొనసాగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆరోవ రాష్ట్రమన్నారు. భవిష్యత్ తెలంగాణ అభివృద్ధి పై రాష్ట్ర ప్రభుత్వం ప్రజెంటేషన్ ఇచ్చింది..కమిషన్ సంతృతి చెందిందన్నారు. అర్బన్ డెవలప్మెంట్ లో తెలంగాణ అభివృద్ధి భాగ జరుగుతోందని కితాబిచ్చారు. కేంద్రం నుంచి రాష్ట్ర వాటా నిధుల కేటాయింపు పెంపు పై దృష్టి సారించాలని కోరారని, 15వ ఆర్థిక సంఘం సూచనల మేరకు 41శాతం కేంద్రం కేటాయింపులు చేసిందన్నారు. కమిషన్ ఇచ్చే సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందన్నారు. నిధుల కేటాయింపు విషయంలో కేంద్రం ఆలోచన విధానాన్ని తాము ప్రశ్నించలేమని ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే వినతుల్లో ప్రజలకు ఉపయోగపడే పాలసీలను కేంద్రానికి కమిషన్ సిఫార్సు చేస్తుందన్నారు.

ప్రజా అవసరాన్ని బట్టి కొత్త బస్సుల కొనుగోలు

- సీఎం రేవంత్‌రెడ్డి
- ఆర్టీసీపై ముఖ్యమంత్రి సమీక్ష

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ప్రజా అవసరాలకు అనుగుణంగా నూతన బస్సుల కొనుగోలుకు రంగం సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పెరిగిన అవసరాలు, నూతన మార్గాలను ఇందుకు ప్రతిపాదిక చేసుకోవాలని సూచించారు. టీజీ ఆర్టీసీపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మహాలక్ష్మి పథకం మహిళలు వినియోగించుకుంటున్న తీరుపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. మహాలక్ష్మి పథకం అద్భుతంగా ఉందని, ఇప్పటి వరకు 83.42 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, ఇందుకు సంబంధించి మహిళా ప్రయాణికులకు రూ.2,840.71 కోట్లు ఆదా అయ్యాయని మంత్రి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీలో 7,292 బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తిస్తోందని ఆయన వివరించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు వస్తున్న మహిళల సంఖ్య పెరుగుతోందని, అందుకు సంబంధించి పత్రికల్లో వచ్చిన కథనాలను ముఖ్యమంత్రికి అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ లో చూపారు.

అనంతరం వివిధ బ్యాంకులు, ఉద్యోగుల భవిష్యత్ నిధి ఖాతా నుంచి వాడుకున్న నిధులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు తదితరాలకు కలిపి రూ.6,322 కోట్ల రుణాలు ఉన్నట్లు అధికారులు వివరించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు చెల్లిస్తున్న వడ్డీ రేటు ఎక్కువగా ఉందని.. వడ్డీ రేట్ల తగ్గింపు, అప్పుల రీకన్‌స్ట్రక్షన్‌పై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సంస్థపై క్రమంగా రుణభారం తగ్గించాలని ఆయన సూచించారు. మహాలక్ష్మి పథకంతో ఆక్యుపెన్సీ రేటు పెరగడంతో పాటు ప్రభుత్వం చెల్లిస్తున్న రీయింబర్స్‌మెంట్‌తో సంస్థ లాభాల్లోకి వస్తోందని అధికారులు తెలిపారు.సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసీం, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

2 రోజుల్లో 35 మంది విద్యార్థులకు విష జ్వరాలా..?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో విష జ్వరాలు విజృంభిస్తూనే ఉన్నాయని, ఇది ఆందోళనకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తాజాగా సిర్పూర్‌లోని సోషల్ వెల్ఫేర్ గురుకుల బాయ్స్ హాస్టల్‌లో రెండు రోజుల్లో 35 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారన్నారు. కోదాడ నుంచి ఆసిఫాబాద్ వరకు విద్యార్థులంతా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతుంటే.. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. విద్యార్థులు విష జ్వరాలా బారిన పడకుండా ప్రభుత్వం వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక జ్వరాల బారిన పడిన విద్యార్థులను వారి తల్లిదండ్రుల వెంట పంపించడం సరికాదు. ప్రభుత్వమే విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించే బాధ్యత తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల, ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య మంత్రిని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.

వెనక్కు తగ్గని డాక్టర్లు..!

బలగం టీవి, కోల్‌కతా

వైద్యురాలిపై లైంగికదాడి, హత్య కేసులో విధులను బహిష్కరించిన జూనియర్ డాక్టర్లు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 5గంటల్లోగా విధుల్లో చేరాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే, డిమాండ్లు నెరవేర్చే వరకు విధుల్లో చేరబోమని జూనియర్ డాక్టర్లు స్పష్టం చేస్తున్నారు. తిరిగి విధుల్లో చేరితే నిరసన తెలిపిన వైద్యులపై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు, బదిలీలు చేపట్టబోమని బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. అయితే, డిమాండ్ల నెరవేర్చకపోతే సమ్మె కొనసాగిస్తామని ఆందోళన చేపడుతున్న వైద్యుల్లో ఒకరు తెలిపారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్, హెల్త్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌ను సాయంత్రం 5 గంటల్లోగా తొలగించామని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని.. చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ సెమినార్ రూమ్‌లో మహిళా పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ మృతదేహం లభ్యమైన కొద్ది గంటలకే జూనియర్ డాక్టర్లు ఆగస్టు 9న తమ సమ్మెకు దిగిన విషయం తెలిసిందే.

మరో వైపు ఆర్థిక అవకతవకల కేసులో ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను సీబీఐ ప్రత్యేక కోర్టు మంగళవారం ఈ నెల 23 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. సెక్యూరిటీ గార్డు అఫ్సర్ అలీతో పాటు ఇద్దరు సహచరులు, కాంట్రాక్టర్ వెండర్ బిప్లబ్ సిన్హా, సుమన్ హజ్రాలకు కోర్టు ఈ నెల 23 వరకు

మిగితా 2వ పేజీలో

హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

బలగం టీవి, హైదరాబాద్

ట్యాంక్ బండ్ హుస్సేన్ సాగర్ లో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హుస్సేన్ సాగర్‌లో గణేష్ నిమజ్జనాలను నిషేధించాలంటూ మరోసారి హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన ధర్మాసనం ముందు హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనాలు వద్దని పిటిషనర్ తన వాదనలు వినిపించారు. గతేడాది ఇచ్చిన తీర్పునే ఈసారి కొనసాగించాలని రిక్వెస్ట్ చేశారు. అదేవిధంగా 'హైడ్రా'ను కూడా ఇందులో ప్రతివాదిగా చేర్చాలని కోరారు. పూర్తి వాదనలు విన్న ధర్మాసనం 'హైడ్రా'ను ప్రతివాదిగా చేర్చేందుకు నిరాకరించింది. చివరి నిమిషంలో కోర్టు ధిక్కరణ పిటిషన్ సరికాదని కోర్టు తప్పుబట్టింది. అదేవిధంగా ఆ పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది.

వెంటిలేటర్‌పైనే సీతారాం ఏచూరి

బలగం టీవి, హైదరాబాద్

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్యం హెల్త్ సిచ్యుయేషన్‌పై డాక్టర్లు బులెటిన్ ప్రకటించారు. ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన ప్రస్తుతం రెస్పిరేటరీ సపోర్ట్‌పై ఉన్నారని డాక్టర్ల బృందం తెలిపింది. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో ఆగస్టు 19న ఏచూరి ఎయిమ్స్‌లో చేరారు. అప్పటి నుంచి చికిత్స కొనసాగిస్తున్నారు. ఇంతకుముందు కూడా ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. దీంతో డాక్టర్లు ఏచూరికి వెంటిలేటర్ అమర్చారు. ఏడుగురు వైద్యుల బృందం ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తోంది.

అగ్రిసెట్ ఫలితాలు విడుదల

బలగం టీవి, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అగ్రిసెట్, అగ్రి ఇంజనీరింగ్ సెట్-2024 ఫలితాలను మంగళ వారం విడుదల చేశారు. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి రఘురామిరెడ్డి అగ్రిసెట్, అగ్రి ఇంజనీరింగ్ - 2024 ఫలితాలను విడుదల చేశారు. ఈ అగ్రిసెట్ ను గత నెల 24న నిర్వహించడం జరిగింది. అగ్రిసెట్ అగ్రి ఇంజనీరింగ్ సెట్ లో అర్హత సాధించిన అభ్యర్థుల మెరిట్ జాబితాను రిజిస్ట్రార్ విడుదల చేశారు.

కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు

● సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెడుతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పాత్ర మరవలేనిదని కొనియాడారు. భూముల ఆక్రమణలు అడ్డుకోవడంలో కాంగ్రెస్ సర్కార్‌కు ఆమె స్ఫూర్తి అని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ధరణి పేరుతో పేదలకు ఇచ్చిన భూములను లాక్కోవాలనే కుట్రలను, రైతాంగ పోరాట స్ఫూర్తితో తిప్పికొట్టామని తెలిపారు. సామాజిక వేత్త కంచె ఐలయ్య సూచించినట్టుగా హైదరాబాద్‌లోని కోఠి మహిళా యూనివర్శిటికి చాకలి ఐలమ్మ పేరు పెడుతామని హామీ ఇచ్చారు. చాకలి ఐలమ్మ మనమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమిస్తున్నట్లు చెప్పారు. ఐలమ్మ కుటుంబం ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. పోరాటస్ఫూర్తి కలిగిన వాళ్లు ప్రజా ప్రభుత్వానికి అవసరమని స్పష్టం చేశారు. చాకలి ఐలమ్మ మనుమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం భూ హక్కులను ధరణి పేరుతో లక్షల ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. అలేఖ్య పుంజాల నేతృత్వంలోని చాకలి ఐలమ్మ నృత్య నాటికను అతిథులు తిలకించారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తి తమ అందరిలో ఉందని రేవంత్ రెడ్డి అన్నారు.



వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 లక్షల విరాళం ప్రకటించిన సినీ నిర్మాత దిల్ రాజు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విరాళం చెక్కును అందజేశారు. సహాయ కార్యక్రమాలకు స్పందించి ప్రభుత్వానికి అండగా నిలిచినందుకు ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు.
వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 లక్షల విరాళం ప్రకటించిన నిర్మాత సూర్యదేవర నాగవంశీ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విరాళం చెక్కును అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో స్పందించి ప్రభుత్వానికి అండగా నిలిచినందుకు ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు.
బలగం టీవి, హైదరాబాద్

హైడ్రా కమిషన్‌కు మరింత భద్రత

బలగం టీవి, హైదరాబాద్

హైడ్రా కమిషన్‌కు మరింత భద్రత కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హైడ్రాకు ప్రత్యేక పోలీసు సిబ్బందిని కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏకంగా 15 మంది సీఐ స్థాయి, 8 మంది ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులను ప్రత్యేకంగా కేటాయించారు.అయితే గత ఆదివారం మాదాపూర్ ప్రాంతంలోని సున్నపు చెరువు వద్ద ఆక్రమణల నిర్మాణాలను తొలగిస్తుండగా.. కొందరు స్థానికులు హైడ్రా అధికారులపై దాడి చేయడంతో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమిస్తూ, హైడ్రా అధికారుల భద్రతను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మంత్రి ఇంటి మీదికి బుల్డోజర్‌ను పంపించే ధైర్యం ఉందా..?

● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

హైడ్రా పేరిట ఇండ్లను కూలగొడుతున్న రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదల ఇండ్ల మీదకు వెళ్లినట్లు.. మీ అన్న తిరుపతి రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటి మీదికి బుల్డోజర్‌ను పంపించే ధైర్యం మీకు ఉందా..? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. ఉన్న ఒక గూటినీ మీ బుల్డోజర్ ప్రభుత్వం కూల్చివేస్తే, కడుపుమండి, కన్నీళ్ళతో కిరసనాయిలు పోసుకున్నందుకు కేసులు పెడతారా అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఎంత సిగ్గుచేటు, ఎంతటి నీతిమాలిన చర్య, మీది ప్రజా ప్రభుత్వం, ప్రజా పాలన కాదు రేవంత్ రెడ్డి, మీరు నడుపుతున్నది బుల్డోజర్ ప్రభుత్వం! కేసుల రాజ్యమంటూ తీవ్ర స్థాయిలో ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

మోడల్ సోలార్ విలేజ్‌గా కొండారెడ్డి పల్లి

- పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా మారనున్న సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం
- 100 శాతం సౌరశక్తి గ్రామంగా కొండారెడ్డి పల్లిని ప్రోత్సహించాలని నిర్ణయం
- ప్రక్రియను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం
- గ్రామంలో పర్యటించి ఇంటింటి సర్వే చేపట్టిన అధికారులు

బలగం టీవి, హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంతూరు కొండారెడ్డిపల్లిని రాష్ట్రంలోనే పూర్తిస్థాయి సోలరైజ్డ్ గ్రామంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో కొండారెడ్డిపల్లి గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా చేయుటకు అధికారులు ప్రక్రియ ప్రారంభించారు.తెలంగాణలో పూర్తి సౌరశక్తితో నడిచే తొలి గ్రామంగా కొండారెడ్డిపల్లి రూపుదిద్దుకోనుంది. 100 శాతం సౌరశక్తితో నడిచే ఆవాసాలకు నమూనాగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఈ గ్రామాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ప్రక్రియను ప్రారంభించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారుల బృందం మంగళవారం గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టింది. టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫారూఖీ, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ సంతోష్, రెడ్కో వీసీ, ఎండీ అనిల్, సంస్థ డైరెక్టర్ కె.రాములు, ఇతర శాఖల ముఖ్య అధికారులు మంగళవారం కొండారెడ్డి పల్లి గ్రామంలో పర్యటించారు.

గ్రామస్థులు, రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో అధికారులు మాట్లాడి ఈ పైలెట్ ప్రాజెక్టు వివరాలను తెలిపారు. ఈ గ్రామంలో దాదాపు 499 గృహ వినియోగదారులు, 66 వాణిజ్య వినియోగదారులు, 867 వ్యవసాయ వినియోగదారులు, ఇతర కేటగిరీలతో కలుపుకుని మొత్తం 1,451 మంది వినియోగదారులు ఉన్నారు. ఈ మోడల్ ప్రాజెక్ట్ అమలు చేసేందుకు ఇంటింటి సర్వేను ప్రారంభించారు. ఈ సర్వే ద్వారా గ్రామానికి అవసరమైన సౌర విద్యుత్ కెపాసిటీని అంచనా వేసి డీపీఆర్ తయారు చేసి ఇతర ప్రక్రియలను ముందుకు తీసుకెళ్లనున్నారు.

నేను ప్రతిపక్షంలో ఉన్నాను

- అందుకే పీఏసీ ఛైర్మన్‌గాపదవి
- సీఎం రేవంత్ రెడ్డి కప్పింది కాంగ్రెస్ కండువా కాదు
- అది దేవాలయాల్లో కప్పే కండువా
- ఎమ్మెల్యే పీఏసీ ఛైర్మన్‌గా అరికేపూడి గాంధీ

బలగం టీవి, హైదరాబాద్

పీఏసీ కమిటీ ఛైర్మన్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించటం ఇప్పుడు.. అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి అగ్గిరాజేసింది. పీఏసీ ఛైర్మన్‌గా అరికేపూడి గాంధీని నియమించటాన్ని ప్రతిపక్ష నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.పీఏసీ ఛైర్మన్ పదవిని ప్రతిపక్ష నేతలకు ఇస్తారని.. కానీ కాంగ్రెస్ కండువా కప్పుకున్న అరికెపూడి గాంధీకి ఈ బాధ్యతలు అప్పగించటం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేస్తున్న విమర్శలపై అరికెపూడి గాంధీ స్పందించారు. తనకు పీఏసీ ఛైర్మన్ పదవి ఇవ్వటంపై వివరణ ఇచ్చారు. మంగళవారం ఓ మీడియా ఛానల్‌తో మాట్లాడిన అరికెపూడి గాంధీ.. తాను ప్రతిపక్షంలో ఉన్నాను కాబట్టే తనకు పీఏసీ ఛైర్మన్ పదవి ఇచ్చారని గాంధీ చెప్పుకొచ్చారు. హరీష్ రావుకు ఇస్తేనే ప్రతిపక్షంగా భావిస్తారా.. వేరే వాళ్లకు ఇస్తే ఒప్పుకోరా అంటూ గాంధీ ప్రశ్నించారు.తనను కొందరు నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నానని ఆరోపిస్తున్నారని ప్రస్తావించిన అరికెపూడి గాంధీ.. క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే.. సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు వెళ్లినప్పుడు ఆయన తనకు దేవాలయాల్లో కప్పే కండువాను కప్పారని.. మిగతావారికి మాత్రం హస్తం గుర్తు ఉన్న కండువాను కప్పినట్టు వివరించారు. తనపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు తనకంటే చాలా సీనియర్లు కావటంతో.. చూపు మందగించి ఉంటుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచానని.. తన నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పనిచేస్తానని చెప్పుకొచ్చారు. తనపై విమర్శలు చేసే వారికి అరికెపూడి గాంధీ సవాల్ విసిరారు. దమ్ముంటే తనతో బహిరంగ చర్చకు రావాలని ఛాలెంజ్ చేశారు. ఎలాంటి పరిణామాలకైనా తాను సిద్ధమని గాంధీ ప్రకటించారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్లు అధికారంలో ఉండ ఏం చేశారో గుర్తుచేసుకోవాలంటూ దుయ్యబట్టారు.

పీఏసీ పదవి ఇచ్చినందుకు.. తాను శాసనసభను సక్రమంగా సాగేలా చూస్తనని.. పాలనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా లోపాలు దొర్లకుండా చూసుకుంటానంటూ అరికెపూడి గాంధీ చెప్పుకొచ్చారు. నలుగురికి న్యాయం జరిగేవిధంగా.. అందరినీ సమన్వయం చేసుకుని.. సమస్యలు, పొరపాట్లు, లోపాలు సరిదిద్దుకుంటూ.. చక్కటి పాలన అందిచే విధంగా.. తనకు అందించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని అరికెపూడి గాంధీ చెప్పారు.

అయితే.. అరికెపూడి గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నాయి. వీడియోల కింద నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. పార్టీ కండువా గురించి మాట్లాడుతున్న అరికెపూడి.. పార్టీ మారాడా లేదా అన్నది మాత్రం చెప్పకుండా చాలా జాగ్రత్త పడ్డాడని కామెంట్లు చేస్తున్నారు. మరోవైపు.. ఇచ్చిన పీఏసీ ఛైర్మన్ పదవికి.. సీఎం పదవి ఇచ్చినట్టుగా పాలన సక్రమంగా జరిగేలా చూస్తానంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నాడంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

దాశరథి అవార్డు గ్రహీత నటేశ్వర శర్మ కన్నుమూత

బలగం టీవి, హైదరాబాద్

సంస్కృతాంధ్ర విద్వతవి, అష్టావధాని, దాశరథి అవార్డు గ్రహీత డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ (68) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన తెలుగు, సంస్కృతంలో 60కి పైగా గ్రంథాలను రచించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కవిగా తన గొంతు విప్పారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి గ్రామంలో జన్మించిన నటేశ్వర శర్మ పద్య, గేయ, వచన ప్రక్రియల్లో కవిత్వం రాశారు. 50కి పైగా కావ్యాలు ప్రచురించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రాచ్య విద్యా పరిషత్ కళాశాల ప్రధానాచార్యులుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. 2011 నుంచి 2013 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో ప్రాచ్య భాషా విభాగానికి డీన్‌గా పని చేశారు. ఆదిశంకరాచార్యులు రచించిన సౌందర్యలహరిపై పరిశోధనకు గానూ 1994లో ఓయూ నుంచి డాక్టరేట్ పట్టా, స్వర్ణ కంకణం పొందారు. ఆముక్తమాల్యదపై ఆయన రాసిన విమర్శన గ్రంథాన్ని తెలుగు యూనివర్సిటీలో పరిశోధనలకు ప్రామాణికంగా తీసుకుంటున్నారు. సంస్కృతాంధ్ర భాషల్లో శర్మ నూటికిపైగా అష్టావధానాలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం ప్రతిష్టాత్మక దాశరథి పురస్కారంతో సత్కరించింది.

నటేశ్వర శర్మకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. గత సంవత్సరం జూన్ 2న రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రసంగంలో నటేశ్వర శర్మ పద్య పాదాన్ని ఉటంకించారు. అయాచితం మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని పలువురు కవులు, ఆయా రంగాలకు చెందిన ప్రముఖులు పేర్కొన్నారు. నటేశ్వర శర్మ మృతికి ఘన నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాజ్యాంగ గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు

● మంత్రి శ్రీధర్ బాబు

బలగం టీవి, హైదరాబాద్

రాజ్యాంగ స్ఫూర్తి గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శాసనసభ నిబంధనల ప్రకారమే పీఏసీ ఛైర్మన్‌ను స్పీకర్ నియమించారని తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాను ప్రతిపక్ష ఎమ్మెల్యేను అని పీఏసీ ఛైర్మన్ స్వయంగా చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ నేతలతో పీఏసీ ఛైర్మన్‌కు అభిప్రాయభేదాలుంటే తమకేం సంబంధమని శ్రీధర్ బాబు అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని ధ్వజమెత్తారు.

'రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవిస్తూ నిబంధనలు, సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకొని అసెంబ్లీ స్పీకర్ ,శాసనమండలి ఛైర్మన్‌లు సభను నిర్వహిస్తారు. వారిని అవమానించేలా ప్రతిపక్షాలు మాట్లాడటం సరైనది కాదు. వ్యక్తులపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ వ్యవస్థను గౌరవించాల్సిందే. సభాపతి ఒక ప్రక్రియ ప్రకారం అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేస్తారు. అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై ఎవరూ మాట్లాడడానికి లేదు'

జీరో ఎంపీ సీట్లు ఇచ్చినా బీఆర్ఎస్ నేతల వైఖరి మారలేదని శ్రీధర్ బాబు ఆక్షేపించారు. ఫలితాల తర్వాత కూడా ఏదో జరుగుతుందని బీఆర్ఎస్ నేతలు కొన్ని రోజులు తిరిగారన్న శ్రీధర్ బాబు అంత తిరిగిన తర్వాత కూడా ప్రజలు మరోసారి తీర్పు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వాన్ని నడపాలని ప్రజలు తమకు తీర్పు ఇచ్చారని వెల్లడించారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యవ్యవస్థలను కాలరాసింది. కూల్చివేసింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలను తారుమారు చేసి అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్కను ఇబ్బంది పెట్టారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు కాకుండా పీఏసీ పదవి ఎవరికి ఇచ్చారో అందరూ చూశారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు బీఆర్ఎస్ నేతల తీరు ఉంది' అని శ్రీధర్ బాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలు, సమాజం కోరుకునే విధంగా తమ ప్రభుత్వ పాలన ఉంటుందని వెల్లడించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు.

వృద్ధురాలికి ఇల్లు కట్టిస్తానని సీఎం భరోసా

బలగం టీవి, హైదరాబాద్

ఇల్లు లేక మరుగుదొడ్లో నివాసం ఉంటున్న ఓ వృద్ధురాలికి సిఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆమెకు తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మీడియాలో వచ్చిన కథనానికి స్పందించిన ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం చిగురాల్‌పల్లిలో ఏరుళ్ల మల్లమ్మ అనే వృద్ధురాలు పేదరికంతో మరుగుదొడ్డిలో నివాసం ఉంటుంది. 20 ఏళ్ల క్రితం తన భర్త చనిపోవడంతో నానా కష్టాలు పడి ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చేసింది. అనంతరం 15 ఏళ్ల క్రితం శిథిలావస్థలో ఉన్న తన ఇల్లు భారీ వర్షాలకు కూలిపోవడంతో అదే స్థలంలో ఓ చిన్న గుడిసె వేసుకుంది. ఎనిమిదేళ్ల క్రితం అది కూడా పడిపోవడంతో స్వచ్ఛ భారత్ మిషన్ కింద ప్రభుత్వం కట్టించిన బాత్రూంలో జీవనం సాగిస్తుంది.

ప్రభుత్వానికి ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టుకున్నా ఇళ్లు కట్టిస్తామని చెప్పిందే తప్ప చేసింది లేదని ఆ వృద్ధురాలు వాపోయింది. మల్లమ్మ విషాదగాథపై ఓ మీడియా కథనం ప్రచురించింది. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్ ద్వారా స్పందించారు. ఇలాంటి పరిస్థితులు చూస్తే బాధ కలుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన సీఎం ఆమెను పరామర్శించడంతో పాటు ఆమె క్షేమం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. అంతేగాక ఆ వృద్ధురాలి ఇంటి మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

డ్రగ్స్ ముఠా అరెస్ట్

● రూ.కోటి విలువైన గంజాయి స్వాధీనం

బలగం టీవి, హైదరాబాద్

ఏపీ నుంచి ముంబయికి గంజాయి తరలిస్తున్న ముఠాను రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 254 కిలోల గంజాయి, 2 కార్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, వస్తువుల విలువ రూ.కోటి నాలుగు లక్షలకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు వివరాలను మీడియా సమావేశంలో రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అరకు నుంచి గంజాయి కొనుగోలు చేసి రెండు కార్లలో యూపీ, ముంబయికి తరలిస్తుండగా నార్సింగి పోలీసులు రెక్కీ నిర్వహించి ఓఆర్ఆర్ ఎగ్జిట్ 17వద్ద నిందితులను పట్టుకున్నారు. ఆ ముఠా నుంచి 254 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.89,09,000 ఉంటుందన్నారు. దీంతోపాటు రెండు కార్లను, రూ.3,700 నగదును స్వాధీనం చేసుకున్నట్టుగా డీసీపీ చెప్పారు. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుడైన సచిన్ సింగ్‌తోపాటు నదీమ్, సక్లైన్, సలీం, ప్రశాంత్ సింగ్‌లను అరెస్టు చేసినట్లు వివరించారు. ఇద్దరు యూపీకి చెందినవారు కాగా, మరో ముగ్గురు ముంబయికి చెందినవారని పోలీసులు వెల్లడించారు.

సచిన్ సింగ్ అనే నిందితుడు ఒక పిస్టల్ వాడుతున్నాడని, అతని నుంచి పాయింట్ 32 కంట్రీమేడ్ వెపన్స్‌తోపాటు బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నట్లుగా డీసీపీ తెలిపారు. నిందితుల్ని అదుపులోకి తీసుకునే క్రమంలో ఎలాంటి కాల్పులు జరగలేదని స్పష్టం చేశారు. మత్తుపదార్థాల సరఫరాకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. రాష్ట్రంలో గంజాయి మాటే వినపించకూడదని సీఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే అధికారులను ఆదేశించిన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణాను ఉక్కుపాదంతో అణిచివేస్తున్నారు.

సైబర్ సెక్యూరిటీ లేకుండా దేశ ప్రగతి అసాధ్యం

● కేంద్ర హోం మంత్రి అమిత్ షా

బలగం టీవి, న్యూఢిల్లీ

ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సి) తొలి వ్యవస్థాపక దినోత్సవంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రసంగించారు. సైబర్ క్రైమ్ సరిహద్దులనేవి లేవని, కనుక అంతా కలిసి దీన్ని ఎదుర్కోవాలని అన్నారు. "సైబర్ సెక్యూరిటీ లేకుండా దేశ ప్రగతి అసాధ్యం. మానవాళికి టెక్నాలజీ ఓ వరం. ఆర్థికవ్యవస్థ బలోపేతం కాడానికి టెక్నాలజీ బాగా ఉపయోగపడుతోంది. అదే సమయంలో టెక్నాలజీతో ముప్పులు కూడా ఉన్నాయి. దేశ భద్రతకు సైబర్ సెక్యూరిటీ కీలకంగా మారింది. సైబర్ సెక్యూరిటీ లేకుండా మన దేశం సురక్షితం కాజాలదు. ఐ4సి వంటి ప్లాట్ ఫామ్స్ ఈ విషయంలో కీలక పాత్ర పోషించగలవు" అని అమిత్ షా తెలిపారు. రాబోయే ఐదేళ్లలో ప్రభుత్వం 5000 సైబర్ కమాండోలకు శిక్షణ ఇచ్చి, సంసిద్ధులను చేయనున్నదని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

వెనక్కు తగ్గని డాక్లర్లు..!

(మొదటి పేజీ తరువాయి)

జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. అవసరమైతే మళ్లీ కస్టడీని కోరుతామని సీబీఐ కోర్టుకు తెలిపింది. ఆర్‌జీ కర్ ఎంసీహెచ్‌లో వైద్యురాలిపై లైంగికదాడి, హత్యకు వ్యతిరేకంగా నిరసనల మధ్య ఆర్థిక అవకతవకల ఆరోపణలపై సందీప్ ఘోష్‌ను సీబీఐ ఈ నెల 2న అరెస్టు చేసింది. 3న కోర్టులో హాజరుపరుచగా

ప్రతి గంటకు 53 ప్రమాదాలు.. 19 మరణాలు..!

● కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

బలగం టీవి, న్యూఢిల్లీ

భారత్‌లో ప్రతి గంటకు 53 ప్రమాదాలు జరుగుతున్నాయని.. ఇందులో 19 మరణాలు నమోదవుతున్నాయంటూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రోడ్డు భద్రతపై వాహనాల తయారీ కంపెనీలకు ఆయన కీలక విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాలంలో భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. రహదానులపై వాహనదారులు, పాదచారులకు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన సొసైటీ ఆఫ్ ఇండియాన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ 64వ వార్షిక సదస్సులో కేంద్రమంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించడంపై భాగస్వాములు దృష్టి సారించాలని కోరారు. దేశంలో అందరికీ సురక్షితమైన రహదానులను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. డ్రైవర్లు స్థానిక నియమాలు, నిబంధనలపై అవగాహన కలిగి ఉన్నారని, అలాగే వాహనాలు నడపడం, నడపడంలో నైపుణ్యం కలిగి ఉండేలా డ్రైవింగ్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని తయారీదారులను కోరారు. దేశంలో ప్రతి గంటకు 53 ప్రమాదాలు, 19 మరణాలు సంభవిస్తున్నాయని.. ఈ విషయంలో ఒక్కసారి ఆలోచన చేయాలని కోరారు. ప్రమాదాల్లో 45శాతం ద్విచక్ర వాహనాలతో, 20శాతం పాదచారులతోనే జరుగుతున్నాయన్నారు. శిక్షణ పాఠశాలలు ఏర్పాటు చేయగలిగితే డ్రైవర్లకు శిక్షణ ఇవ్వగలమని.. ఇది నిజంగా సానుకూల పరిష్కారం కావచ్చన్నారు.

నాసిరకం రోడ్ల నిర్మాణం, సూచికలపై కేంద్ర రోడ్లు రహదారుల శాఖ దృష్టి సారించిందన్నారు. వాహనాల భద్రతను సైతం నొక్కి చెప్పారు. భారత్ ఎన్‌క్యాప్ ప్రాముఖ్యతను సైతం ఆయన హైలెట్ చేశారు. కస్టమర్లకు సురక్షితమైన వాహనాలను కలిగి ఉండేందుకు తయారీదారుల మధ్య ఆరోగ్యకరమైన పోటీని భారత్ ఎన్‌క్యాప్ నిర్ధారిస్తుందన్నారు. కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ అనేది భారత మార్కెట్‌లో విక్రయించే వాహనాలకు సొంత క్రాష్ సేఫ్టీ రేటింగ్. ప్రయాణీకుల భద్రత, పిల్లల భద్రత, కారులో అందుబాటులో ఉన్న సేఫ్టీ పరికరాల ఆధారంగా ప్రతి కారు మోడల్‌కు రేటింగ్ ఇస్తుంది.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బలగంటివి,సిరిసిల్ల:

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయంలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యాలయ ఆవరణ, తరగతి గదులు, కిచెన్, తదితర వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.బాలుర, బాలికల వసతి గృహాలు, తరగతి గదుల్లో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భోజన సదుపాయం, తరగతులు ఎలా బోధిస్తున్నారు అనే వివరాలను ఆరా తీశారు. టాయిలెట్లు తక్కువగా ఉన్నాయని వెంటనే రెండు టాయిలెట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఎంపీడీఓను ఆదేశించారు. గ్రామం నుండి విద్యాలయం వరకు రోడ్ సరిగా లేదని రోడ్డు నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాలని ,విద్యార్థులకు ఉపాధ్యాయులు తరగతులు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అన్ని సబ్జెక్టులలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా పాఠాలు బోధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తదితరులు ఉన్నారు. తదనంతరం నిమ్మపల్లి గ్రామంలో చేపడుతున్న బ్రిడ్జి మరమ్మత్తు పనులను కలెక్టర్ పరిశీలించారు.

చాకలి ఐలమ్మకు కలెక్టర్ నివాళ్లు

బలగంటివి,రాజన్న సిరిసిల్ల

చాకలి ఐలమ్మ వర్ధంతి ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మనోధైర్యంతో ముందుకు వెళ్లాలి..

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బలగంటివీ, రాజన్న సిరిసిల్ల,

మానసిక ఒత్తిడి, మానసిక సమస్యలతో బాధపడేవారుమనోధైర్యంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో టోల్ ఫ్రీ నెంబర్ 14416 పోస్టర్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎంహెచ్ఓ వసంతరావు తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ర్యాలీలు నిర్వహించి ఆత్మ హత్యల నివారణ గురించి అవగాహన కల్పించాలని, యువత, విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

మానసిక సమస్యలకు చికిత్స తీసుకునే కంటే వీటిని దాచి పెట్టేందుకు చాలా మంది ప్రయత్నిస్తారని, ఈ సమస్యపై మాట్లాడేందుకు చాలా మంది ఇష్టపడరని అన్నారు.జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో మానసిక కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, చికిత్స పూర్తిగా ఉచితముగా అందిస్తామని, వారియొక్క వివరాలు గోప్యముగా ఉంటాయని స్పష్టం చేశారు. ఆత్మహత్యలను అడ్డుకోవడంలో టెలీమానాస్ (టోల్ ఫ్రీ నెంబర్ 14416) 24%ళ%7 సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ సేవలను ప్రజలు వియోగించుకోవాలని ,వైద్యుల సూచన మేరకు సూచించిన మోతాదులో మందులు వాడితే ఆత్మ హత్యలు నివారించ బడుతాయని అన్నారు, సమాజం, చుట్టూ ప్రక్కల వారు ఆత్మ న్యూనత భావనతో ఉన్న వారికి చేయూత ఇవ్వాలని, అవగాహనతో మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానసిక వైద్య నిపుణులు ప్రవీణ్ కుమార్, డాక్టర్ నయీమా జహా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు గడువులోగా సాయం అందాలి...

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బలగంటివి,రాజన్న సిరిసిల్ల:

రోడ్డు ప్రమాద బాధితులకు గడువులోగా సాయం అందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం హిట్ అండ్ రన్ అంశంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ అఖిల్ మహాజన్, ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాద బాధితులు, వారి కుటుంబ సభ్యులకు నిర్ణయించిన గడువులోగా రెవెన్యూ, పోలీస్ అధికారుల నివేదిక ప్రకారం పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబానికి రూ. రెండు లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు కోర్టు గైడ్లైన్స్ ప్రకారం కేసుల విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీఎం హెచ్ఓ వసంత రావు, డీటీఓ లక్ష్మణ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఘన్ శ్యామ్ ఓజా తదితరులు పాల్గొన్నారు



టీపీసీసీ అధ్యక్షుడిని కలసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

బలగంటివి,వేములవాడ

నూతన టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాద్‌లో తన నివాసంలో మంగళవారం ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపి,శాలువా కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ ఎస్ యు ఐ నుంచి కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగి పీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మహేష్ కుమార్ గౌడ్ అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తారనే ఉద్దేశంతో కాంగ్రెస్ హై కమాండ్ పిసిసి అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత పటిష్టవంతంగా తయారవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ,వేములవాడ నియోజకవర్గ పరిధిలో గడపగడపకు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు

సదరం శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్..

బలగం టీవీ , సిరిసిల్ల

వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన సదరం శిబిరాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్థో వైకల్య నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా, కలెక్టర్ పరిశీలించారు. ఎందరికి పరీక్షలు చేశారో వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య ను అడిగి తెలుసుకున్నారు. 36 మందికి గానూ 33 మందికి చేసినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ అనిల్ కుమార్, డీఆర్డీవో ఏపీఎం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో.

ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సిరిసిల్లలో ఆర్థో వైకల్య నిర్ధారణ పరీక్షలకు 55 మంది దరఖాస్తు చేసుకోగా, 49 మంది హాజరు అయినట్లు ఆర్ఎంఓ సాయి కుమార్ తెలిపారు. శిబిరంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్ కుమార్, ఎముకల వైద్య నిపుణురాలు డాక్టర్ సాధన తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

● రజక సంఘం నాయకులు

బలగంటివి,తంగళ్లపల్లి

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని రజక సంఘం నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలోని దొరలకు, భూస్వామ్యాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి విసునూర్ దేశ్ ముఖ్ లపై పోరాటం చేసి స్ఫూర్తిగా నిలిచిందని భూమికోసం,భుక్తి కోసం తిరుగుబాటు చేసి సాయిధరైతంగా పోరాటానికి ఉద్యమ స్ఫూర్తిని చాటిందని తన ఆశయాలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా తెలిపారు

రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

బలగం టీవీ , తంగళ్ళపల్లి

తంగళ్ళపల్లి మండలం బస్వాపూర్ గ్రామంలో రెడ్డి సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షులుగా ఆలూరి తిరుపతిరెడ్డి,ఉపాధ్యక్షులుగా ముత్తంగి ప్రతాపరెడ్డి,ప్రధాన కార్యదర్శిగా ముత్తంగి హనుమంత రెడ్డి,క్యాషియర్ యేళ్ల మోహన్ రెడ్డి లు నియామకమయ్యారు.అనంతరం వారు రెడ్డి సంఘం అభివృద్ధికి తోడ్పడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా నాయకులు సత్తు శ్రీనివాస్ రెడ్డి,సత్తు రామ్ రెడ్డి,కూర శంకర్ రెడ్డి,ముత్తంగి సత్తిరెడ్డి, ముత్తంగి మధు రెడ్డి,రెడ్డి సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి కలెక్టర్ సన్మానం

బలగం టివి,సిరిసిల్ల

కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల సిరిసిల్లలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ టీచర్ గా పనిచేస్తున్న పాకాల శంకర్ గౌడ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు స్వీకరించిన సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో మంత్రుల నుంచి పాకాల శంకర్ గౌడ్ అవార్డు స్వీకరించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలువగా, టీచర్ ను కలెక్టర్ సన్మానించి, ఆయన విద్యార్థులకు అందిస్తున్న సేవలను ప్రశంసించారు.

పాకాల శంకర్ గౌడ్ ఫిజికల్ సైన్స్ టీచర్ గా ప్రయోగాలు విద్యార్థులతో చేపిస్తూ సైన్స్ ఎగ్జిబిషన్లో, ఇన్స్పైర్ అవార్డులలో, అటల్ టింకరింగ్ లాబ్ నిర్వాహనలో అత్యున్నత ప్రతిభ కనబరిచారు. తను గైడ్ టీచర్ గా తయారు చేసిన పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మిషన్ 2022-23 సంవత్సరానికి ఇన్స్పైర్ మానాక్ జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికై పలువురు మనల్ని పొందింది.ఈ నెలలో డిల్లీ ప్రదర్శనలో పాల్గొననుంది. గతంలో మూడు సార్లు ఇన్స్పైర్ మానక్ రాష్ట్ర స్థాయికి ,జెఎన్ఎంఎస్ఎస్ సైన్స్ ఎగ్జిబిషన్ లో రెండు సార్లు రాష్ట్ర స్థాయికి తను గైడ్ టీచర్ గా ప్రాజెక్ట్ లు ఎంపిక అయ్యాయి. విద్యార్థి పరిపూర్ణుడుగా రూపొందాలంటే అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఉద్దేశంతో సహ పాఠ్య కార్యక్రమాలు, బోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ ప్రశంసలందుకున్నారు. టీచర్ శంకర్ గౌడ్ ను పలువురు అభినందించారు.

తెలంగాణ సీఎం సహాయనిధికి రూ.5కోట్ల విరాళం అందజేసిన మేఘా సంస్థ

బలగం టీవీ , హైదరాబాద్

రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాల వెల్లువ కొనసాగుతోంది. వరద సహాయక చర్యల కోసం మేఘా ఇంజినీరింగ్ సంస్థ ఎండీ పి.వి.కృష్ణారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి రూ.5కోట్ల రూపాయల చెక్కు అందజేశారు. హైదరాబాద్ రేస్ క్లబ్ జూబ్లీ హిల్స్‌లోని రేవంత్ నివాసంలో రూ.2 కోట్ల రూపాయలు విరాళంగా అందజేసింది. లలితా జ్యువెలర్స్ అధినేత కిరణ్ సీఎంఆర్ఎఫ్‌కు కోటి రూపాయలు విరాళం అందజేశారు. మైత్రా ఎనర్జీ గ్రూప్, అక్షత్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్లు విక్రం కైలాస్, రవి కైలాస్ కోటి రూపాయలు రిలీఫ్ ఫండ్‌కు ఇచ్చారు.

సైయెంట్ గ్రూపు ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బీవీ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించి అందుకు సంబంధించిన చెక్కును రేవంత్ రెడ్డిని కలిసి అందజేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు కూడా ఉన్నారు.



ఇందిరా మహిళాశక్తితో ఆర్థిక ప్రగతి..

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బలగం టీవీ , సిరిసిల్ల

ఇందిరా మహిళాశక్తితో పథకంతో మహిళలు ఆర్థికంగా ప్రగతి పథానికి దోహదపడుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెడికల్ కళాశాలలో తంగళ్ళ పల్లికి చెందిన మార్కండేయ మహిళా సమాఖ్య సభ్యులు మహిళాశక్తి క్యాంటీన్ ను ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై ప్రారంభించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు కలిసికట్టుగా స్థానిక ఆహార పదార్థాలు నాణ్యతతో అందజేయాలని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఆర్థికంగా ప్రగతి సాధించి మిగితా సంఘాలకు ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి నారాయణ, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, డీపీఎంలు సంధ్యారాణి, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ

బలగం టివి,భద్రాచలం



ఎగువ నుంచి పోటెత్తుతున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మంగళవారం గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇది సోమవారం 26 అడుగుల మేరకే ఉండింది. నీటి మట్టం పెరుగుతుండడంతో అధికారులు రెండో హెచ్చరిక జారీ చేశారు.గోదావరి నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉందని కేంద్ర జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. ఇక శబరి, సీలేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చింతూరు మండలంలోని అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. భద్రాచలం వద్ద నీటీ వేగం పెరుగుతోంది. నీటిమట్టం పెరగడంతో స్నానఘట్టాలు, కల్యాణ కట్ట వద్ద చాలా మెట్లు వరదనీటిలో మునిగాయి. శబరి నది పోటెత్తడంతో భద్రాచలం దిగువన ముంపు మండలాలకు వెళ్లే ప్రధాన రహదారిపైకి నీరు చేరి పలు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువన శ్రీరాం సాగర్ బ్యారేజి నుంచి వరదనీరు దిగువకు విడుదల చేయడంతో మంగళవారం ఉదయం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం 5 గంటలకు 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం మరింత పెరుగుతుందని, లోతట్టు ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. తాలిపేరు ప్రాజెక్టు నుంచి లక్షా 50 వేల క్యూసెక్కుల వరద వస్తోందని అన్నారు.

దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌కు జట్లు ప్రకటన

బలగం టీవి, న్యూఢిల్లీ

దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ గురువారం నుంచి మొదలవ్వనుంది. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు ఎంపికైన వాళ్లు విశ్రాంతి తీసుకోనున్నారు. అందుకని దులీప్ ట్రోఫీ నుంచి ఓపెనర్ యశస్వీ జైస్వాల్, వికెట్ కీపర్ రిషభ్ పంత్‌లతో పలువురు ఆటగాళ్లకు బీసీసీఐ రెస్ట్ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం బీసీసీఐ దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ కోసం స్క్వాడ్‌ను ప్రకటించింది.

ఇండియా బీ తరపున ఫినిషర్ రింకూ సింగ్ ఆడనున్నాడు. ఓపెనర్ మయంక్ అగర్వాల్ ఇండియా ఏ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 12 నుంచి దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ జరుగనుంది. ఈసారి ఇండియా బీ తరపున పంత్ బదులు రింకూ బరిలోకి దిగనున్నాడు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ స్థానంలో సుయాశ్ ప్రభుదేశాయ్ ఆడనున్నాడు. ఇండియా ఏ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నుంచి మయాంక్ అగర్వాల్ పగ్గాలు అందుకోనున్నాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు స్క్వాడ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, కుల్దీప్ యాదవ్, అకాశ్ దీప్, అక్షర్ పటేల్‌లు సైతం దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌లో ఆడడం లేదు. తొలి రౌండ్‌లో ఇండియా ఏపై ఇండియా బీ, ఇండియా డీపై ఇండియా సీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

రెండో రోజూ రద్దు

- మొదలు కాని న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్‌ల ఏకైక టెస్టుల

బలగం టీవి, న్యూఢిల్లీ

: ఏకైక టెస్టు ఆడేందుకు భారత్‌కు వచ్చిన న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్‌లకు నిరాశ తప్పడం లేదు. తొలిరోజు మాదిరిగానే రెండో రోజు కూడా ఆట సాగలేదు. వర్షం పడకున్నా గ్రేటర్ నోయిడాలోని స్టేడియంలో ఔట్ ఫీల్డ్ పూర్తిగా సిద్ధమవ్వలేదు. ఇంకా అక్కడక్కడ తడిగానే ఉండడంతో వరుసగా రెండో రోజు కూడా టాస్ వేయకుండానే అంపైర్లు ఆటను రద్దు చేశారు. దాంతో, మూడు రోజుల మ్యాచ్‌లో తాడేపేడో తేల్చుకోనున్నాయి.'సోమవారంతో పోల్చితే మంగళవారం ఔట్‌ఫీల్డ్ కాస్త మెరుగ్గానే ఉంది. కానీ, ఆటకు అనుకూలంగా ఉన్నట్టు అంపైర్లు భావించలేదు. దాంతో, వరసగా రెండో రోజు కూడా రద్దు చేయాల్సి వచ్చింది. బుధవారం అయినా ఆట సాగుతుందని ఆశిస్తున్నా' అని ఫర్వీజ్ మహరూఫ్ వెల్లడించాడు.

నాలుగైదు రోజుల క్రితం నోయిడాలో భారీ వర్షాలు పడ్డాయి. దాంతో, స్టేడియం మొత్తం తడిసిముద్దైంది. ఔట్ ఫీల్డ్ పూర్తిగా నీళ్లతో నిండిపోయింది. సెప్టెంబర్ 8, ఆదివారం నుంచే గ్రౌండ్ సిబ్బంది నీటిని తోడేసే పని చేపట్టారు. అందువల్ల షెడ్యూల్ ప్రకారం సోమవారం మ్యాజ్ జరగాలి. వాన లేకపోవడంతో ఆలస్యంగానైనా మ్యాచ్ సాగుతుందని న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్ ఆటగాళ్లు అనుకున్నారు.

మైదానం ఎంపిక విషయంలో బీసీసీఐ తప్పులేదు : ఏసీబీ

అఫ్గాన్ క్రికెట్‌కు అండగా ఉంటున్న బీసీసీఐ.. ఆ దేశ హోమ్ మ్యాచ్‌లను భారత్‌లో ఆడుకునే వెసులు బాటు కల్పిస్తోంది. ఈ క్రమంలోనే అఫ్గానిస్థాన్ వర్సెస్ న్యూజిలాండ్ ఏకైక టెస్టుకు నోయిడా మైదానాన్ని కేటాయించింది. అయితే ఈ నొయిడా స్టేడియంపై బీసీసీఐ 2017లోనే నిషేధం విధించింది. ఇక్కడ జరిగిన ఓ కార్పోరేట్ మ్యాచ్‌లో ఫిక్సింగ్ జరిగిందనే ఆరోపణలతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది.అప్పటి నుంచి ఇక్కడ బీసీసీఐ అనుబంధిత టోర్నీ ఒక్కటి కూడా జరగలేదు. అంతేకాకుండా ఈ స్టేడియం ఏ రాష్ట్ర క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో లేదు. గ్రేటర్ నొయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ స్టేడియాన్ని చూసుకుంటుంది. దాంతో ఈ స్టేడియం నిర్వాహణ అధ్వాన్నంగా తయారైంది. కనీస మౌళిక సదుపాయాలతో పాటు సిబ్బంది కూడా లేరు. ఇక డ్రైనేజ్ వ్యవస్థ దారుణంగా ఉంది.

అయితే ఈ మైదానం ఎంపిక విషయంలో బీసీసీఐ తప్పులేదని, తామే నోయిడా మైదానాన్ని ఎంచుకున్నామని అఫ్గాన్ క్రికెట్ బోర్డు(ఏసీబీ) అధికారి మెహనాజుద్దీన్ రాజ్ స్పష్టం చేశారు. తమకు దగ్గరగా ఉంటుందనే నోయిడా మైదానాన్ని ఎంచుకున్నామని చెప్పారు. 'అఫ్గాన్–న్యూజిలాండ్ ఏకైక టెస్ట్ కోసం బీసీసీఐ.. కాన్పూర్, బెంగళూరుతో పాటు గ్రేటర్ నోయిడా మైదానాలను ఆఫర్ చేసింది. మేం గ్రేటర్ నోయిడాను ఎంచుకున్నాం. ఎందుకంటే ఇది ఢిల్లీకి దగ్గరగా ఉంటుందని, కాబుల్ నుంచి ఈజీగా రావచ్చని భావించాం. ప్రయాణల పరంగా ఇదే మాకు అత్యుత్తమ వేదిక. అందుకే ఈ మైదానాన్ని ఎంచుకున్నాం.'అని చెప్పుకొచ్చారు.

పారాలింపిక్స్ విజేతలకు భారీ ప్రైజ్‌మనీ

బలగం టీవి, న్యూఢిల్లీ

పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ దుమ్మురేపింది. ఈ సారి అత్యధిక పతకాలు సొంతం చేసుకుంది. దీంతో పతక విజేతలకు భారత ప్రభుత్వం భారీ క్యాష్ ప్రైజ్‌ను ప్రకటించింది.ఈ సారి మొత్తం 84 మంది అథ్లెట్లు పోటీపడగా, దేశానికి 29 పతకాలు లభించాయి. ఇందులో 7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలు ఉన్నాయి. పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచింది.

మంగళవారం న్యూ ఢిల్లీలో జరిగిన వేడుకల్లో పారాలింపిక్ విజేతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులకు క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవియా నగదు పురస్కారాలను ప్రకటించారు.

బంగారు పతక విజేతలకు రూ.75 లక్షలు

పారాలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు రూ.75 లక్షలు అందు కుంటారు. రజత పతక విజేతలకు రూ.50 లక్షలు, కాంస్య పతక విజేతలకు రూ.30 లక్షలు నగదు బహుమతి అందజేస్తామని క్రీడా మంత్రి ప్రకటించారు. అదే సమయంలో, ఆర్చర్ శీతల్ దేవి వంటి మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో పతకాలు సాధించిన వారికి రూ.22.5 లక్షల నగదు బహుమతి అందజేస్తారు.

2028 లాస్ ఏంజెల్స్ పారాలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించేందుకు పారా అథ్లెట్లకు పూర్తి మద్దతు, సౌకర్యాలు కల్పిస్తామని మాండవ్య హామీ ఇచ్చారు. పారాలింపిక్స్, పారా స్పోర్ట్స్‌లో భారత్ రాణిస్తోందని తెలిపారు. బంగారు పతకాలు సాధించేందుకు వీలుగా పారా అథ్లెట్లు అందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మాండవ్య తెలిపారు.

అంచనాలను పెంచేసిన దేవర ట్రైలర్

బలగం టీవి, హైదరాబాద్

ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతోన్న దేవర సినిమా సెప్టెంబర్ 27వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. విడుదల తేదీ దగ్గరపడుతోన్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్‌లో వేగాన్ని పెంచేసింది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు ప్రమోషన్స్ కూడా అదే స్థాయిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసిం ది. కొరటాల మరోసారి కరెక్ట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నట్లు స్పష్టమవు తోంది.

అసలెవరు వాళ్లంతా.. కులం లేదు.. మతం లేదు.. భయమే లేదు.. ధైర్యం తప్ప ఏమీ తెలియని కళ్లల్లో మొదటిసారి భయం పొరలు కమ్ముకున్నాయంటూ బ్యాక్ గ్రౌండ్ వాయిస్‌తో సాగే సంభాషణలతో షురూ అయింది ట్రైలర్. ఎవరు చేశారిదంతా అంటుంటే.. చాలా పెద్ద కథ సామి.. రక్తంతో సముద్రమే ఎరుపెక్కిన కథ.. మా దేవర కథ.. అంటూ ప్రకాశ్ రాజ్ వాయిస్ ఓవర్‌తో సాగు తున్న డైలాగ్స్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. స్టన్నింగ్‌గా సాగుతున్న ట్రైలర్ తారక్ అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించనున్నట్టు చెప్పకనే చెబుతోంది.

దేవరలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర రోల్‌లో నటిస్తుండగా.. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదలకు ముందే అనార్డ్ అమెరికా బాక్సాఫీస్ వద్ద ప్రీ సేల్స్‌లో రూ.8.2 కోట్ల మార్క్‌ను అధిగమించి అరుదైన ఫీట్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ట్రైలర్ విడుదలకు ముందే వేగంగా 1 మిలియన్ డాలర్ క్లబ్‌లోకి చేరిన తొలి ఇండియా సినిమాగా అరుదైన రికార్డు నమోదు చేసింది.

గాంధారిగా తాప్సీ పన్ను..

బలగం టీవి, హైదరాబాద్

తాప్సీ పన్ను తాజాగా మరో నెట్‌ఫ్లిక్స్ ప్రాజెక్ట్ అప్‌డేట్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. రైటర్ కనిక ధిల్లాన్‌తో కలిసి సినిమా చేస్తుండగా.. ఈ ప్రాజెక్టుకు గాంధారి టైటిల్‌ను ఫైనల్ చేశారు.యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రాన్ని అనౌన్స్‌మెంట్ టీజర్‌తో ప్రకటించారు మేకర్స్. దేవాశిష్ మఖీజా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హెూంబ్యానర్ కథా పిక్చర్స్‌పై కనికా ధిల్లాన్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలపై త్వరలోనే క్లారిటీ రానుంది.

వరద బాధితులకు తమిళ నటుడు శింబు రూ.6 లక్షల విరాళం

బలగం టీవి, హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో సంభవించిన వరదల కారణంగా ప్రభావితమైన బాధితులకు తాజాగా తమిళ హీరో శింబు రెండు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్స్‌కి భారీ విరాళం ఇచ్చారు. మూడు లక్షల చొప్పున మొత్తం ఆరు లక్షల రూపాయలను ఆయన విరాళంగా ప్రకటించారు.